www.prajasakti.com

# ప్రజాశక్తి

గురువారం 25 సెప్టెంబర్ 2025

5

వైఎస్ఆర్

## డిఎ అరియర్స్ వెంటనే చెల్లించాలి

**ప్రజాశక్తి-కాశినాయన:** సిపిఎస్ ఉద్యోగి, ఉపాధ్యాయులకు 2018 జూలై 2019 జనవరి నుండి చెల్లించవలసిన డిఎ బకాయిలను వెంటనే విడుదల చేసి దసరా కానుకగా ఆ కుటుంబాల్లో ఆనందం నింపాలని కూటమి ప్రభుత్వాన్ని రాష్ట్ర సిపిఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడుతామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర నిరాశ, అసంతృప్తి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం దాటిన సిపిఎస్ ఉద్యోగులకు ఇవ్వవలసిన డిఎ అరియర్స్ గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమని పేర్కొన్నారు. నిత్యావసర ధరలు పెరగడం వల్ల జీవన ఖర్చులు అదుపులో లేక ఉద్యోగ, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్క ఉద్యోగికి సగటున రూ.50 వేలు అరియర్స్ రావాలన్నారు.

# ధర దిగాలు.. రైతులు కుదేలు

- సాయం తక్కువై.. వ్యయం ఎక్కువై..
- ఉల్లి, టమోటా రైతులకు నష్టం
- దిగుబడి పెరిగినా.. పెట్టుబడి రాని వైనం
- రైతుల లోగిళ్లలో మగ్గుతున్న పత్తి
- పండ్ల ధరలూ అంతంత మాత్రమే

ఉల్లి పంటను ఆరబెడుతున్న రైతులు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు కుదేలవుతున్నారు. ప్రభుత్వం నుంచి సాయం లేక రైతన్నకు వ్యయం ఎక్కువైంది. ఉల్లి, టమోటా ధరలు నేలచూపు చూడడంతో రైతన్నకు నష్టాలు మిగిలాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తుండటంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. పంటలు సాగుచేయాలంటేనే రైతులు వెనకంజవేసే పరిస్థితి నెలకొంది. తీరా పంట చేతికొచ్చిన తర్వాత గిట్టుబాటు ధరలు వస్తాయో రావోనన్న టెన్షన్‌లో రైతన్న కొట్టుమిట్టాడుతున్నాడు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటపు ప్రచారాలు చేయడమే తప్ప ఆచరణలో మాత్రం శూన్యంగా ఉండటంతో రైతుల లోగిళ్ళలో పంటలు మగ్గే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా జిల్లాలో వేలాది ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసారు. గత ఏడాది కిలో రూ.75 నుండి రూ.85 వరకు అమ్మింది. ప్రస్తుతం రూ.65 మాత్రమే ఉంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి కొనుగోలు చేస్తుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రోడ్డెక్కి ఆందోళన చేసిన పరిస్థితులు కూడా ఉన్నాయి.

### ఉల్లి, టమోటా ధరలు నేలచూపు

ఉల్లి రైతు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఉల్లి పంటను కొనడానికి వ్యాపారులు ముందుకు రాక పొలాల్లోనే రైతులు వదిలేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పిన ఇంతవరకూ కల్పించలేదు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తున్న చేస్తామని ప్రకటించింది. ఇ-క్రాఫ్ చేయించుకున్న వారికి మాత్రమే రాయితీ వస్తుందని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టమోటా ధరలు కూడా గత ఆరు నెలల నుంచి కిలో రూ.10కి నుంచి పోలేదు. అటు ఉల్లి రైతులు ఇటు టమోటా రైతులు గిట్టు బాటుధరలేక ఆవేదన చెందుతున్నారు. ఒకప్పుడు టమోటా, ఉల్లి ధరలు సెంచరీ దాటిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం రూ.10 నుంచి రూ.15లకు పడిపోయింది.

అరటి పంట

### పడిపోయిన అరటి, చీనీ ధరలు

గతంలో అరటి టన్ను ధర రూ.30 వేలు ఉండగా ప్రస్తుతం రూ.10 వేలు లోపు ఉంది. చీనీ టన్ను ధర రూ.50 వేలు ఉండగా ప్రస్తుతం రూ.10 వేలు ఉంది. ఎన్నడు లేని విధంగా చీనీ ధరలు పడిపోవడంతో రైతులు చీనీ చెట్లను నరికి వేస్తున్నారు. అరటి రెండు, మూడు పంట కాయలను వ్యాపారులు అడిగే పరిస్థితి లేదు. రైతులు ఎంతో కొంత ఇచ్చి కాయలు తీసుకు వెళ్ళమని వ్యాపారులను బతిమాలుతున్న పరిస్థితి నెలకొంది. ధరలు పూర్తి స్థాయిలో పడిపోయి రైతులు నష్టపోతున్నారు.

### ధరలు తగ్గడం ఎప్పుడూ లేదు

అన్ని పంటలకు ఒకేసారి ధరలు తగ్గడం ఎప్పుడూ చూడలేదు. ఏదోఒక పంటకు గిట్టుబాటు ధర ఉండడంతో నష్టం వచ్చేది కాదు. ఒక పంట ధర తగ్గినా ఇంకో పంటకు ధర ఉండటం వల్ల రైతులు కొంతవరకు ఊరట కలిగేది. ఇప్పుడు ఒకేసారి అన్ని పంటలకూ ధరలు తగ్గాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

**- గంగిరెడ్డి, రైతు, పులివెందుల.**

### ధర లేక చీనీ చెట్లను కొట్టేసాను

గిట్టుబాటు ధర లేక చీనీ చెట్లను నరికి వేయాల్సి వచ్చింది. పంటకు తెగులు రావడంతో మందులు ఎక్కువగా పిచికారి చేయాల్సి వచ్చేది. అధిక ఖర్చు రావడం, ధరలు లేక నష్టాలు వస్తుండడంతో నాకున్న రెండు ఎకరాల చెట్లను కొట్టివేయడం జరిగింది.

**- రామిరెడ్డి, రైతు, లింగాల.**

# ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనకు కృషి చేయాలి

**- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్**

మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

**ప్రజాశక్తి - కడప**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనకు కృషి చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ఆకాంక్ష జిల్లా, బ్లాకుల లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఆకాంక్ష జిల్లా, బ్లాకుల్లో జిల్లాలో సామాజిక స్థాయిని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడంలో పురోగమనంలో ఉన్నామన్నారు. ఇప్పటికే కొన్ని విభాగాలలో ఆయా ప్రమాణికాలను లక్ష్యం సాధించామని, ఇంకనూ కొన్ని శాఖల్లో అన్ని పారామీటర్లలో వంద శాతం లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో జిల్లా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఆకాంక్ష బ్లాకుల లక్ష్యసాధనలో భాగంగా చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు మండలాలలో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఆకాంక్ష జిల్లా, బ్లాకుల ఆశయ సాధన లక్ష్యాలను సంతృప్త స్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో కృషి చేయాలన్నారు. ప్రధానంగా హెల్త్ అండ్ న్యూట్రిషన్ విభాగంలో జిల్లాలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న, జరిగిన ప్రగతిపై ఎడిపి యంగ్ ప్రొఫెషనల్ విష్ణుతేజ పిపిటి ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఎడ్యుకేషన్, వ్యవసాయం-అనుబంధ రంగాలు, ఆర్థిక రాజదలు-స్కిల్ డెవలప్‌మెంట్, కనీస మౌలిక సదుపాయాల కల్పన.. మొదలైన రంగాల వారీగా జిల్లాలో సాధించిన ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఒ హజరత్తయ్య, డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి, ఐసిడిఎస్ పీడీ రమాదేవి, స్మార్ట్ కిచెన్స్ నోడల్ పర్యవేక్షక అధికారి జోయల్ విజయ్ కుమార్, సంబంధిత శాఖల ఎడిపి యంగ్ ప్రొఫెషనల్‌లు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై పోరాటాలు : సిఐటియు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

**ప్రజాశక్తి-కడప అర్బన్**

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, కార్మికులకు రూ.18,600 అధికారుల ద్వారా ఇప్పించాలని కడప ఎంపీ వైఎస్. అవినాష్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వగా వెంటనే స్పందించడం అభినందనీయమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, బద్వేలు, కడప జిజిహెచ్ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో జిఒ నంబర్ 549 ప్రకారం రూ.16 వేలు ఇవ్వాల్సి ఉండగా, 10 వేలు నుంచి రూ.12 వేలు మధ్యలో ఇస్తున్నారని చెప్పారు. కాంట్రాక్టర్లు నిలువు దోపిడీ చేశారని పేర్కొన్నారు. ఈ తరుణంలో కొత్త అగ్రిమెంట్ ప్రకారం రూ.18,600 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11 వేలు మాత్రమే ఇస్తు న్నారని తెలిపారు. ఎంపీ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఆయన ఈ నెల 20న ముఖ్యమంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఈ తరుణంలో కాంట్రాక్టర్లు కొంత చలనం వచ్చిందని తెలిపారు. పీఎఫ్, ఇఎస్ఐ పోను కొత్త అగ్రిమెంట్ ప్రకారం రూ.13,960 ఇవ్వా ల్సిన అవసరం ఉందన్నారు. సెక్యూరిటీ లాగానే శానిటేషన్ కార్మికులు కూడా కొత్త కాంట్రాక్టర్ ఇదే స్థాయిలో ఇవ్వాలని కోరారు. లేబర్ కోడ్స్ ప్రకారం కార్మికులకు అందాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ ఇవ్వాలని పేర్కొన్నారు. కార్మికులకు జరు గుతున్న అన్యాయాలపై రాబోయే కాలంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షులు పవన్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

## కుర్చీ కోసం మేయర్ పాకులాట

**- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి**

**ప్రజాశక్తి-కడప అర్బన్**

కడప కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని కోర్టు మేయర్‌ను దోషిగా నిర్ధారించినా కుర్చీ కోసం ప్రాకులాడడానికి సిగ్గుండాలని మేయర్ సురేష్ బాబు తీరుపై టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ద్వారకానగర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టం తెలిసిన వ్యక్తిగా అవినీతి ఆరోపణలపై రాజీనామా చేసి తన నిర్దోషత్వాన్ని నిరూపించుకోవాలే తప్ప, కుర్చీ కోసం కోర్టులకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. మేయర్లుగా ఉన్న వ్యక్తులు అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదు చేయగా ఆయనను తొలగించిన న్యాయస్థానానికి వెళ్లి స్టే తెచ్చుకున్నారని గుర్తు చేశారు. కార్పొరేషన్‌లో అవినీతి న్యాయస్థానంలో రుజువు కావడంతో ప్రభుత్వం మేయర్‌ను పదవి నుంచి తొలగించిందని పేర్కొన్నారు. ఇక ఏ న్యాయస్థానానికి వెళతారని నిలదీశారు. కోర్టుకు వెళ్లే అవకాశం లేదన్నారు. కార్పొరేషన్ ఎన్నికలకు ఆరు నెలల వ్యవధి ఉందని, కుర్చీకి అంటిపెట్టుకుని ఇంకాస్త అవినీతితో సొమ్ము వెనకేసుకుందామని ఆలోచిస్తున్నారేమో అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అవినీతి నాయకులు ఓట్ల కోసం వస్తే, ప్రజలు తరిమికొట్టాలని ప్రజలను కోరారు. ప్రజలు టిడిపి అభ్యర్థులను కార్పొరేటర్లుగా గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ నెల 28న ఉదయం 10 గంటలకు షామీరియా, లా కాలేజీల వద్ద బ్రిడ్జిల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అసమ్మతి వాదులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఆధిపత్యం రెడ్డప్ప గారి కుటుంబానిదేనని ఒక ప్రశ్నకు సూటిగా బదులిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అమరావతికి డిఎస్‌సి అభ్యర్థుల పయనం

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** ఉమ్మడి కడప జిల్లా నుంచి ఎంపికైన డిఎస్‌సి అభ్యర్థులు 869 మంది, 122 స్టాఫ్, 15 మంది పోలీసుల భద్రతతో కలెక్టరేట్ ప్రాంగణం నుంచి ఉదయం 9.40 గంటలకు 43 ఆర్టీసీ బస్సుల్లో అమరావతికి బయలుదేరి వెళ్లారు. బుధవారం డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 25న మధ్యాహ్నం 2.30 గంటలకు అమరావతి సెక్రటేరియట్ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ చేతులు మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జెసి అదితిసింగ్, డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఎంపిక ప్రక్రియకు పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు ఉమ్మడి జిల్లా విద్యా శాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన 869 మంది అభ్యర్థుల్లో 637 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిలు ఉండగా, మిగిలినవారు టిజిటి, పిజిటిలు ఉన్నారు.

## మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

**ప్రజాశక్తి-కాశినాయన :** గ్రామాలలో ప్రతి స్త్రీ ఆరోగ్యవంతురాలుగా ఉండి తమ కుటుంబానికి ఆధారంగా ఉండాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మండల వైద్యాధికారులు ప్రశాంతి, పుష్పా, పేర్కొన్నారు. బుధవారం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్త్రీలకు అందరికీ ఆరోగ్య సేవలు అందించాలని, కుటుంబంలో స్త్రీలు ఆరోగ్యవంతంగా ఉంటేనే కుటుంబంలో అందరూ బాగుంటారని, ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించటానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ముందు ఉంటుందని పేర్కొన్నారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యాధికారుల సూచనలు తప్పక పాటించాలని తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్లచేత అందరికీ వైద్య పరీక్షలు చేయించి అందరికీ అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది నరసింహులు, ప్రసాద్, బ్రహ్మానందరెడ్డి, నిర్మల, శారద, బాలయ్య, నర్సాపురం సర్పంచ్ ఖాజావలి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ పాల్గొన్నారు.

## విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-కడప అర్బన్:** జిల్లాలో ప్రయివేటు టీచర్లకు దసరా సెలవులు ఇవ్వకుండా వేధిస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్‌జెడి కార్యాలయం ఎఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు టీచర్లను దసరా సెలవులలో తప్పకుండా రావాలని బలవంతం చేస్తున్నారని, రాకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. కడపలో చైతన్య, నారాయణ కార్పొరేట్ విద్యా సంస్థలు వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు స్కూల్స్ యాజమాన్యాలు పాఠశాలలకు స్కూల్ వర్క్ పేరుతో రావాలని చెబుతున్నారన్నారు. సంబంధిత విద్యా శాఖ అధికారులు యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ ఎథేచ్ఛగా వర్క్‌షాప్, స్కూల్ వర్క్ జరుపుతున్నా పట్టించుకోలేదన్నారు. ప్రయివేటు టీచర్లను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని చెప్పారు. ఓవర్ డ్యూటీ చేయించుకునే వీరు కనీసం పండుగ పూట బోనస్‌లు కూడా ఇవ్వరని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధిలో కీలక పాత్ర మాత్రం ఉపాధ్యా యులదేనన్నారు. శ్రమ దోపిడి చేస్తున్నారని తెలిపారు. ప్రయివేటు టీచర్లకు సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్న పాఠశాలల యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

## టిడిపి నగర కార్యనిర్వాహక కార్యదర్శిగా సిలాస్

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** తెలుగుదేశం పార్టీ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నగరంలోని అశోక్ నగర్ కు చెందిన బోనం సిలాస్ నియమితులయ్యారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డికి, కడప ఎమ్మెల్యే మాధవికి కృతజ్ఞతలు తెలిపారు. అనతి కాలంలోనే తనను గుర్తించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయనని చెప్పారు. నగరంలోని అన్ని డివిజన్లలో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సానుభూతిపరులను అక్కున చేర్చుకుంటూ పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల ముంగిటకు చేరవేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. పదవి వచ్చేందుకు సహకరించిన రాంప్రసాద్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, చిన్నబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

## మహిళలు ఉద్యోగ నైపుణ్యాలు కలిగి ఉండాలి

**ప్రజాశక్తి-కడప అర్బన్:** పేరెన్నిక కలిగిన కంపెనీల్లో మహిళలకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అందుకు తగినట్లుగా ఉద్యోగ నైపుణ్యాలు నేర్చుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కందుల గ్రూప్ కళాశాలల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్‌రెడ్డి కోరారు. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఏర్పాటు చేసిన స్వాగతోత్సవంలో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తమ పిల్లలను ఉద్యోగాలు చేసే విధంగా తల్లితండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. మహిళలకు ఉన్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ రత్నమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్రమ శిక్షణ అవసరమని తెలిపారు. కొత్తగా చేరిన విద్యార్థినులు తమ సీనియర్లకు తగిన విధంగా గౌరవం ఇవ్వాలని పేర్కొన్నారు. మంచి విద్యాభ్యాసం కలిగి ఉండాలని చెప్పారు. కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలగాలని పేర్కొన్నారు.

## వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీధర్



నియామక పత్రం అందుకుంటున్న శ్రీధర్

**ప్రజాశక్తి-కడప అర్బన్:** వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మురికినాటి శ్రీధర్ బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కడప ఎమ్మెల్యే మాధవి హాజరు కావడం పట్ల హర్షవ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మురికి నాటి హనుమంతు, ఆకుల వెంకటేష్, రమేష్ బాబు, ఎద్దుల శంకర్, ఒంటేరు కృష్ణయ్య, కార్పొరేటర్ సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, రవి పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు రుణాలు

**ప్రజాశక్తి-కాశినాయన**

నరసాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో గల ప్రతి డ్వాక్రా మహిళలకు రుణాలు ఇచ్చి వారి ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తామని నరసాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇంద్రాణి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్రా మహిళలు ఎవరైనా రుణాలు తీసుకుంటే కచ్చితంగా కట్టించే బాధ్యత వెలుగు సిబ్బంది కూడా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళలకు రుణాలు ఇస్తామని ఎక్కడ ఎవరు కూడా రుణాలు చెల్లించకుంటే వెలుగు సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి వారికి తగు సూచనలు ఇచ్చి తిరిగి రుణం చెల్లించే విధంగా చైతన్య పరచాలన్నారు. ఎపిఎం అనంతయ్య మాట్లాడుతూ మండలంలో రుణాలు తీసుకున్న ప్రతి డ్వాక్రా మహిళా కచ్చితంగా తిరిగి కంతులు వారీగా చెల్లించాలని నెల కంతులు వారిగా చెల్లించకపోతే మనకు అధిక వడ్డీ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నర్సాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్, సిసిలు సిద్దయ్య, సునీల్, ప్రతాప్, అకౌంటెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

## రేపు ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పర్యటన

**ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె**

ఎపి రైతు సంఘం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న పెండింగ్ ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవికతను అధ్యయనం చేసి నిజాలు నిగ్గుతేల్చి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు క్షేత్రస్థాయి పర్యటన చేపడుతున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని తెలిపారు. దశాబ్దాల తరబడి రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయని తెలిపారు. బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడంతో ప్రాజెక్టులు దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పదవి కాంక్ష తప్ప ప్రాంతాల అభివృద్ధి కొరకు ఈ ప్రాంత రాజకీయం నేతలు నోరు మెదడుపడం లేదన్నారు. ప్రాజెక్టులో పూర్తి చేయడంలో పాలక పర్వతాలు వైఫల్యం చెందాయని తెలిపారు. మండలంలో గాలేరు-నగరిలో అంతర్భాగంగా ఉన్న గుర్రంగుంపు స్టాక్ పాయింట్‌ను క్షేత్రస్థాయి పర్యటన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, మండల అధ్యక్షులు చిన్న సిద్దయ్య పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల పాదయాత్ర

**ప్రజాశక్తి-కడప అర్బన్**

నగరంలోని మున్సిపల్ కార్మికుల నివాస ప్రాంతాలలో మున్సిపల్ యూనియన్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. బుధవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రన నగర గౌరవ అధ్యక్షులు చంద్రారెడ్డి ప్రారంభించారు. తిలక్ నగర్, అరుంధతి నగర్‌లో మొదటి రోజు పాదయాత్ర కొనసాగించారు. ఈ సందరరేగా చంద్రారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు నివాసమున్న ప్రాంతాలు దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరాములు, నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్ మాట్లాడుతూ డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఇంటి అద్దెలు కట్టలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ కాల్వ పేరుతో కార్మికుల ఇళ్లను తొలగించాలని, వాటిని నిర్మించాలని డిమాండ్ చేశారు. తెల్లవారు జామున 4.30 గంటలకు మస్టర్‌కు వస్తున్నా మున్సిపల్ కార్మికుల అవస్థలు అంతా ఇంతా కాదని పేర్కొన్నారు. సమయానికి రాకపోతే సెక్రటరీ ఇంటికి పంపిస్తున్నాడని తెలిపారు. మొదటి రోజు పాదయాత్ర తిలక్ నగర్ వద్ద ప్రారంభమై అరుంధతి నగర్ వద్ద ముగిసింది. ఈ పాదయాత్రలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకుల రామమోహన్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మహిళా కమిటీ సభ్యురాలు ఆరోగ్యమ్మ, నగర కమిటీ సభ్యులు నాగరాజ్, మహేంద్ర, రాముడు, పాలేటి చిన్నగంగయ్య, శివకుమార్, హరి కృష్ణ, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు మెరుగుపరచాలి : కమిషనర్

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** నగరంలో మౌలిక వసతులు మెరుగుపరచాలని కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఈస్ట్, సౌత్ జోన్‌లో సందర్శించారు. 22వ డివిజన్‌లో క్లాప్ వెహికల్‌ని ఆకస్మిత తనిఖీ చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని డ్రైవర్‌ని ఆరా తీశారు. తప్పని సరిగా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని పేర్కొన్నారు. ఉక్కాయ్యపల్లిలో ఉన్న ఓల్డ్ డంపింగ్ యార్డ్, ప్రస్తుత ఎకో పార్క్‌ను పరిశీలించారు. ఈ పార్క్‌ని ప్రజలకి ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్పొరేషన్‌లో ఉన్న అన్న క్యాంటిన్‌ను సందర్శించారు. అక్కడ ప్రజలతో మమేకమై భోజనం, సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## యువతకు రుణాలు మంజూరు చేయాలి

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** ప్రభుత్వం నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరు చేయాలని డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ ఇడి రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, కెవిపిఎస్ నగర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరు చేస్తామని, వారికి ఆర్థిక భరోసా ఇచ్చి స్వయం ఉపాధిని కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన ఇంతవరకు యువతకు రుణాలు లేవు కదా కార్పొరేషన్ లో నిధులు కరువయ్యాయని తెలిపారు. ప్రభుత్వం కార్పొరేషన్లకు నిధులు కేటాయించి యువతకు రుణాలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

## విద్య చాలా విలువైంది : జడ్జి

**ప్రజాశక్తి - కడప:** విద్య చాలా విలువైనదని క్రమశిక్షణతో అభ్యసించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం కడపలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత మరియు భద్రత ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహము, ప్రభుత్వ పరిశీలన గృహం సూపర్ ఇండెంట్, డిస్టిక్ ప్రొబేషన్ ఆఫీసర్, వైద్యాధికారిణి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక స్పృహ కలిగి ఉండాలి

**ప్రజాశక్తి - కడప:** ఎన్ఎస్ఎస్ విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత స్పృహ పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు చేసిన సేవ సమాజంలో మార్పుకు దారితీస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ అనేది కేవలం సేవా కార్యక్రమం మాత్రమే కాదన్నారు. వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శ కమన్నారు. సమాజం పట్ల బాధ్యత, సేవాభావం, క్రమశిక్షణను అలవర్చుకోవడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్యార్థులు కళాశాలలోనే కాక, సమాజంలో కూడా మంచి పౌరులుగా నిలబడేలా ఈ సంస్థ మార్గనిర్దేశనం చేస్తోంది అని తెలిపారు. ఎన్ఎస్ఎస్‌లో పాల్గొనే వాలంటీర్లు భవిష్యత్తులో సమాజానికి ఆదర్శప్రాయులుగా మారాలని కోరారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అంకాల నాగరాజు, రమేశ్, శివ రామకృష్ణ ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని సేవా భావాన్ని వ్యక్తం చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇసి నిర్లక్ష్య వైఖరి వీడాలి : డిసిసి

**ప్రజాశక్తి-కాశినాయన**

దొంగ ఓట్లు తొలగించడంలో ఇసి నిర్లక్ష్యం వైఖరి విడాలని డిసిసి అధ్యక్షులు ఎన్‌డి విజయజ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని నరసాపురంలో ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుల్లూరు పెద్దఖాజావలి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లక్ష సంతకాల సేకరణ చేసి ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఇసికి నివేదిక సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ అన్వర్, పుల్లూరుబాష, చిన్న రామిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సయ్యద్ రఫీ, నారాయణరెడ్డి, నాయబ్ రసూల్, జయరాజు, పుల్లయ్య, రాయప్ప పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్, హౌసింగ్, మెప్మా సిబ్బంది

## అర్హులందరికీ ఇల్లు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించాలనేది ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 ఉద్దేశ్యమని అధికారులు పేర్కొన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో బుధవారం అంగీకార్-2025 పోస్టర్‌ను మున్సిపల్ కమిషనర్ రాముడు, హౌసింగ్, మెప్మా అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంగీకార్ అనేది ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఉద్దేశించిన కార్యక్రమమని తెలిపారు. ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు నిర్మించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవ కాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రామసూరారెడ్డి, సిఎల్‌టిసి రామచంద్రారెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్లు రామాంజనేయులు, మధు, వీరయ్య , ఆర్పీలు పాల్గొన్నారు.

## బాలగంగమ్మ నేత్రదానం

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

మండల పరిధిలోని ఎర్రబల్లి కొత్తపల్లి గ్రామానికి చెందిన బాల గంగమ్మ (93) బుధవారం మరణించడంతో ఆమె కుమారులు శ్రీరాములు, పెద్ద రామాంజనేయులు, చిన్న రామాంజనేయులు, కుమార్తెలు వెంకటలక్షుమ్మ, రామ లక్షుమ్మ, రామాంజనమ్మ, గంగాదేవి, గంగా భవాని నేత్రదానానికి అంగీ కరించారు. ఆ మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు, టెక్నీషియన్ అరవింద్‌తో కలిసి మృతురాలి నివాసం వద్దకు వెళ్లి కార్నియాలను సేకరించారు. వాటిని కడప ఎల్‌వి ప్రసాద్ నేత్రనిధికి పంపారు. నేత్రదానం కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిఒక్కరూ నేత్రదానంపై అవ గాహన కలిగి ఉండాలన్నారు. నేత్రదానానికి సంబంధించి 99665 09364ను సంప్రదించాలని వారు సూచించారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు డాక్టర్ వివేకానందరెడ్డి యాదవ్, డాక్టర్ రామగంగాధర్ యాదవ్, రాధాక్రిష్ణ, ప్రవీణ్, నిరంజన్, గ్రామ పెద్దలు, అభినందనలు తెలిపారు.

## మహిళల చైతన్యమే దేశ సమగ్రాభివృద్ధి

**ప్రజాశక్తి - వేంపల్లె**

మహిళలు చైతన్యవంతులైతేనే దేశం సమగ్రాబివృద్ధి చెందుతుందని వైవియూ జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిఎం ఉష పథకంలో భాగంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో సగ భాగం ఉన్న మహిళలు చైతన్యవంతులు కావాలన్నారు. సమాచార చట్టం మొదటగా ఐరోపా ఖండంలోని స్వీడన్ దేశంలో రెండు శతాబ్దాల పూర్వం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం దాదాపు 90 దేశాలలో ఆ చట్టం రావడానికి దోహద పడిందన్నారు. భారతదేశంలో 2005లో ప్రారంభమైందని తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని సాధారణ మానవుల నుంచి ఉద్యోగస్తుల వరకు వినియోగించుకోవచ్చునని వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ కలిపి ప్రధానమంత్రి ఉచ్ఛతర శిక్ష అభియాన్ పథకం కింద వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. తద్వారా కళాశాలకు దాదాపు రూ.10 కోట్ల మంజూరు చేయడంతోపాటు కళాశాలలోని మౌలిక వసతులకు ఈ పథకం దోహదపడుతుందని చెప్పారు. పథకం కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండా సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ పథకం కింద ఎన్నికైన కళాశాలలు ఐదు, ఇందులో రాయలసీమ ప్రాంతం వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల కావడం గమనార్హమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బాలకొండ గంగాధర్, కళాశాల అధ్యాపకులు అరవింద్, డాక్టర్ బండి రామకృష్ణ, డాక్టర్ నాగలక్ష్మిదేవి, సుధాకర్, గ్రంథాలయ అధికారి డాక్టర్ పి.మాధవరావు, డాక్టర్ ఎన్ కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మల్లేశ్వరమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, వినోద్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, రాజారెడ్డి, ప్రసాద్, కేశమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్‌ది బాధ్యతారాహిత్యం

**ప్రజాశక్తి - వేంపల్లె**

పులివెందుల ఎమ్మెల్యేగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతగా వ్యవహరించకపోవడం శోచనీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల ఎమ్మెల్యేగా జగన్‌రెడ్డి అసెంబ్లీకి పోయి నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గ సమస్యలపై పట్టని జగన్‌కు ఆ పదవిలో ఉండే అర్హత లేదన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేయకపోతే అసెంబ్లీకి వెళ్లి పులివెందుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. అరటి, చీనీ, ఉల్లి, టమోటా, దానిమ్మ ఇలా ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. పులివెందులలో పేదల ఇంటి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. వేంపల్లెలో పారిశుధ్యం పడకేసిందని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గోగుల రమేష్, నూర్‌బాషా, అంజి, రమేష్, నాగరాజు, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బండారు వెంకటేష్, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

# క్రైం కార్నర్

### తండ్రితో నిశ్చితార్థానికి వచ్చి

## కారు కిందపడి చిన్నారి మృతి

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని చిన్న గురువలూరు గ్రామంలో కారు ఢీకొని గొల్లపల్లి దర్శిని (6) చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన చోటు చేసుకుంది. బంధువులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామంలో బంధువుల వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి బి.మఠం మండలం నందిపల్లె నుండి రాజు తన కుమార్తెతో హాజరయ్యాడు. రోడ్డు మీద ఆడుకుంటున్న చిన్నారిని గమనించని డ్రైవర్ కారు వెనుకకు తిప్పుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. చిన్నారికి బలమైన గాయాలు కావడంతో చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన చిన్నారి దర్శిని

# ఆనందాశ్రమం వద్ద దారి మూసివేత

### ఎనిమిది గ్రామాల ప్రజలకు రాకపోకల సమస్య - సంబంధిత అధికారులు స్పందించాలని వినతి

**ప్రజాశక్తి - చాపాడు**

బళ్లారి-నెల్లూరు రోడ్డు విస్తరణలో భాగంగా మండల పరిధిలోని ఆనందాశ్రమం రోడ్డు నుండి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గోపిరెడ్డిపల్లె వరకు ఔటర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. మైదుకూరు పట్టణంలోకి భారీ వాహనాలు వెళ్లకుండా బద్వేలు, నెల్లూరు వెళ్లే వారికి ఈ ఔటర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఉపయోగకరం. ఈ నేపథ్యంలో ఈ రోడ్డు 8 గ్రామాల ప్రజలకు ఇబ్బందికరంగా తయారైంది. వివరాల్లోకి వెళితే.. ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఆనందాశ్రమం రోడ్డు ముగియగానే ప్రారంభమవుతుంది. ఈ బ్రిడ్జి ప్రారంభం వద్ద ఆనందాశ్రమం, వడియ రాజుపేట, శ్రీరామ్‌నగర్, సోమాపురం, దళితవాడ, సిద్ధారెడ్డిపల్లె, నాగాయపల్లె గ్రామాల ప్రజలు వెళ్లేందుకు ఆర్అండ్‌బి రహదారి ఉంది. ప్రస్తుతం ఈ ఆర్అండ్‌బి రహదారికి అనుసంధానంగా బళ్లారి-నెల్లూరు రోడ్డుపై నుంచి ప్రొద్దుటూరు వెళ్లేందుకు, మైదుకూరు నుండి వచ్చే సమయంలో ఈ రహదారికి వెళ్లేందుకు అవకాశం లేకుండా రోడ్డు పూడ్చివేశారు. ఆయా గ్రామాలకు చెందిన సుమారు 4వేల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ఆయా గ్రామాలకు ప్రతిరోజు పదికిపైగా పాఠశాలల బస్సులు, ఆటోలు, ప్రజలు నిత్యం వివిధ వాహనాలలో ప్రయాణిస్తుంటారు. వీరు ప్రొద్దుటూరు వెళ్లాలన్న, మైదుకూరు నుంచి గ్రామానికి వెళ్లాలన్నా సరైన మార్గం లేకుండా చేశారు. మైదుకూరు నుంచి వీరు గ్రామానికి వెళ్లే దారిని పూడ్చి వేయడంతో ప్రస్తుతం అదనంగా లక్ష్మీపేట గ్రామం వరకు ప్రయాణించి అక్కడ ఉన్న యూటర్న్ ద్వారా తిరిగి వెనుకకు కిలోమీటర్ ప్రయాణించాల్సిన పరిస్థితి వచ్చింది. మొత్తానికి మైదుకూరు వెళ్లాలన్న, ప్రొద్దుటూరుకు వెళ్లాలన్న వీరికి అదనంగా రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేషనల్ హైవే అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే ఆయా గ్రామాల ప్రజలకు ఉన్న రహదారి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

మూసేసిన ఆనందాశ్రమం రోడ్డు

# సమాజ శ్రేయస్సు దృష్ట్యా బాధ్యతగా పనిచేయాలి

విశిష్ట సేవలందించిన విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్

**ప్రజాశక్తి - వేంపల్లె**

సమాజ శ్రేయస్సు దృష్ట్యా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు బాధ్యతగా పని చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సేవాభావంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా పథకాన్ని 1969 సెప్టెంబర్ 24న నాటి కేంద్ర విద్యాశాఖ మంత్రి వికెఆర్‌యు రావు ప్రారంభించారన్నారు. ఎన్ఎస్ఎస్ ఏర్పాటు సూచికగా ప్రతి ఏడాది సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భారత ప్రభుత్వం ప్రతి ఏడాది దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జాతీయ సమైక్యత శిబిరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ యవజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వశాఖ అధ్వర్యంలో నడిచే ప్రభుత్వ కార్యక్రమమన్నారు. సమాజ సేవ ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం అన్నారు. అనంతరం ఆయా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, వైఆర్‌సి కో-ఆర్డినేటర్ సుధాకర్, డాక్టర్ నాగలక్ష్మిదేవి, కిరణ్మయి, లైబ్రేరియన్ మాధవరావు, పలు వురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నవ భారత సమాజ పునర్నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ట్రిపుల్ఐటిలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వ హించారు. విద్యార్థి దశలో సేవా భావాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డి నేటర్ డాక్టర్ జి.దీప్తి, ప్రోగ్రాం అధి కారులు తిరుపతిరెడ్డి, గోవర్ధన్, సుబ్బ రాయుడు, అరుణ్ కుమార్‌రెడ్డి, అనిత, కోనప్ప, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

**చాపాడు :** మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే, ఎన్ఎస్ఎస్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివ రించారు. సమాజంలో సామాజిక సేవ ఉపయోగాన్ని తెలుసుకోవాలన్నారు. విద్యా ర్థులు ఎన్ఎస్ఎస్‌లో భాగమైతే పొందే ప్రయోజనాలను వివరించారు. ప్రతి విద్యార్థి సేవా కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, అధ్యాపకులు రాధారామ్, అనురాధ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్ :** ప్రాణాప్రాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం ఒక సంజీవిని వంటిదని ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవ తెలిపారు. పులివెందుల పట్టణ పరిసరాల లోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ జయమ్మ, ఇంజినీర్ నజ్మా, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవ మాట్లాడుతూ రక్తదానం ఆరోగ్యాన్నిస్తుందన్నారు. కొత్త రక్తం ఉత్పత్తి అవడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. ఔత్సాహికులైన కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు 17 మంది రక్తదానం చేశారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ ప్రదీప్, ఎన్‌వి సుబ్బారెడ్డి, కుమారి, మాధవి, కళాశాల సూపరింటెండెంట్ శివరామిరెడ్డి, డాక్టర్ రాజశేఖర్, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

## హామీలు అమలయ్యేలా చూడాలి

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

డ్రైవర్లకు ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేసేలా చూడాలని జయహో రథసారథి జిల్లా ఇన్‌ఛార్జి హరిబాబు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఎంపీ, వేముల మండల పార్టీ కన్వీనర్ నాగెళ్ల సాంబశివారెడ్డిని కలిసి ఆయన సమస్యలను వివరించారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా తమ పార్టీ డ్రైవర్ల పక్షాన నిలుస్తుందని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం హరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు కావస్తున్నా భారీ వాహనాలు నడిపే ఏ ఒక్క డ్రైవర్‌కు కూడా న్యాయం చేయలేదన్నారు. నేడున్న సమాజంలో అత్యవసర. నిత్యవసర సరుకులు సరఫరా చేసే హెవీ డ్రైవర్లకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. హామీలు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలతోపాటు రాష్ట్ర బంద్‌కు కూడా పిలుపునివ్వనున్నట్లు ఆయన హెచ్చరించారు.

ఎంపీ అవినాష్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న హరిబాబు

తెలిపారు. పులివెందుల రహదారిలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో బుధవారం ఎఇ ఆధ్వర్యంలో కొత్తగా కెవిఎ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ నాలుగు రోడ్ల కూడలి, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని కాలనీల్లో విద్యుత్ సరఫరా తక్కువ వోల్టేజ్ ఉందన్నారు. వినియోగదారులు, రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అదనంగా కొత్త 100 కెవిఎ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగు రోడ్ల సమీపంలోని సాయినగర్, బాలికల ఉన్నత పాఠశాల దారిలోని సాయిబాబా గుడి, జెండా మాను వీధిలోని ప్రాంతాలకు సంబంధించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు యోగానంద రెడ్డి, శ్రీనివాసులు, జెఎల్‌ఎం చంద్ర పాల్గొన్నారు.

## గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి - చాపాడు**

స్థానిక గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎన్నికను గ్రంథాలయ అధికారి జె శివశంకర్‌రెడ్డి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అధ్యక్షులుగా ఎం కరీముల్లా, కార్యదర్శిగా ఎంవి సుబ్బారెడ్డి, కోశాధికారిగా పి మహమ్మద్ రఫీ, కమిటీ సభ్యులుగా పి. పోలయ్య, సుబ్బరాయుడు, సభ్యులుగా ఎస్ గురుస్వామి, సురేంద్ర, గంగ గోపాల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

## ఘనంగా మెరిట్ స్కాలర్‌షిప్ అవార్డు ప్రదానోత్సవం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

స్థానిక ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బుధవారం పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో వై.వి.నాయుడు చారిటబుల్ ట్రస్ట్ కడప ఆర్థిక సహకారంతో మెరిట్ స్కాలర్‌షిప్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ గురు మూర్తిరెడ్డి తెలిపారు. ఆరు విభాగాల మెకానికల్, ట్రిపుల్ ఇ, సి.ఎస్.ఈ., ఈ.సి.ఈ.విద్యార్థులలో ప్రస్తుతం రెండవ సంవత్సరం చదువు తున్నవారిలో మొదటి సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన వారు ప్రస్తుతం మూడవ సంవత్సరం చదువుతున్నవారిలో గత రెండు సంవ త్సరాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. పూర్వ విద్యార్థుల కమిటీ కో-ఆర్డినేటర్, ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి చేతుల మీదుగా విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సం దర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభను సాధించడానికి కృషి చేస్తే సమాజంలోని దాతలు ముందుకు వచ్చి ప్రోత్సాహం అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరింతమంది విద్యా ర్థులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ చైర్మన్ వై.వినయ్‌కుమార్ మాట్లాడుతూ తన తండ్రి వై.వి.నాయుడు ఈ కళాశాలలో ప్రిన్సిపల్‌గా సేవలందించారని తెలిపారు. ఆయన స్మారకార్థం మా కుటుంబం ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం పి. గురు మూర్తిరెడ్డిని ట్రస్ట్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ సి.సునీత, కోశాధికారి వై.సాయి వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి బి.అంజలి ప్రసన్న, ప్రభుత్వ పాలిటెక్నిక్ విభాగాధిపతులు అశోక్‌బాబు, మంజునాథ్, విజయకుమార్, వీరభద్రారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న నిర్వాహకులు

## కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈనెల 22 నుండి అక్టోబర్ 2వరకు సెలవులు ప్రకటించిందన్నారు. జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థలైన శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలు ఇప్పటివరకు తమ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించలేదన్నారు. కడప కేంద్రంగా జిల్లాలోని శాఖల నుండి ప్రయివేట్ టీచర్స్‌ను కడపకు రప్పించి విద్యాశాఖ అధికారుల అనుమతి లేకుండా వర్క్‌షాప్‌లు, క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. తక్షణమే జిల్లా విద్యాశాఖాధికారులు చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్న కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని గడ్డం రాజు డిమాండ్ చేశారు.

## చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 6,7 తేదీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించనున్నట్లు ఆ సం ఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ తెలిపారు. రాష్ట్ర మహాసభల కరపత్రాలను బుధవారం జమ్మలమడుగు బీసీ కాలనీలో ఆయన ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు సుబ్బారాయుడు, నారాయణ, జగదీశ్, శంకర్ పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ, జరిమానా

**ప్రజాశక్తి - వేముల**

కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని పోలీసుస్టేషన్ వద్ద బుధవారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్రవా హనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలులేని వారికి ఇ-చలానా విధించారు.

## నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

విద్యుత్ సరఫరా తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని ఆ శాఖ ఎఇ శ్రీనివాసరెడ్డి

స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ చేస్తున్న మారెడ్డి జోగిరెడ్డి

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావు లేకుండా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తుంగభద్ర ప్రాజెక్ట్ హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యత కలిగిన రేషన్ సరఫరా అందించేందుకు వీలుగా, అక్రమాలు, అవినీతి కట్టడికి స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో దోహదపడతాయన్నారు. ఎటిఎం కార్డు సైజులో క్యూఆర్ కోడ్‌తో తయారైన ఈ స్మార్ట్ కార్డులు పూర్తిగా టెక్నాలజీ ఆధారంగా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకట సాయి నాథ్‌రెడ్డి, డిటి శ్రీహరిబాబు, వీఆర్వో పుష్పరాజు, మండల కూటమి నాయకులు పుప్పాల శ్రీధర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

**చాపాడు :** సోమాపురం పంచాయతీలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ కార్డుదారులందరికీ నూతనంగా స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసీ కెనాల్ నీటి సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, వీఆర్వో సుబ్బన్న పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ కమిటీలో వేములకు స్థానం

### వైస్ చైర్మన్‌గా కల్లూరు చంద్రవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్‌గా అలవలపాటి రమాదేవి

**ప్రజాశక్తి - వేముల**

పులివెందుల మార్కెట్ యార్డ్ కమిటీలో మండలవాసులకు స్థానం లభించింది. వైస్ చైర్మన్‌గా పెండ్లూరు గ్రామానికి చెందిన కల్లూరు చంద్రవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్‌గా అలవలపాటి రమాదేవి(ఎస్‌సి)ని నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా లింగాల మండలం గుణకనపల్లె బీసీ వర్గానికి చెందిన గడ్డం అమర్నాథ్ యాదవ్‌ను నియమించారు. కల్లూరు చంద్రవర్ధన్ రెడ్డి గత ఎన్నికల ముందు వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇరువురికి పదవులు రావడంపట్ల టిడిపి నాయకులు, కార్య కర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనమీద నమ్మకంతో పులివెందుల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించిన టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. పార్టీ ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ రైతులకు నిరంతరం అందు బాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## నీటిపారుదల పథకాల అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి - చాపాడు**

రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న ఎత్తిపోతల పథకాలను అభివృద్ధి చేసి, వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పిస్తామని నీటి పారుదల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విజయవాడలో ఆయన డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి డంపింగ్ స్కేల్ ఎత్తిపోతల పథకాలు ఉండగా, వీటిలో 160 మాత్రమే పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయన్నారు. వీటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. టిడిపి అధి కారంలోకి వచ్చిన తర్వాత నీటిపారుదల అభివృద్ధి సంస్థ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న రూ.10 కోట్ల వేతనాలను చైర్మన్ లీలాకృష్ణ యుద్ధ ప్రాతిపదికన ఇప్పిం చారన్నారు. సిఎం చంద్రబాబు సహకారంతో త్వరలో అన్ని ఎత్తిపోతల పథ కాలను అభివృద్ధి చేస్తామన్నారు. తనకు డైరెక్టర్ గా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాణ స్వీకారానంతరం మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

## ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి - వేముల**

వేముల పిహెచ్‌సి పరిధిలోని వేల్పుల విలేజ్ హెల్త్ కేంద్రంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ శరణ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. గర్భిణులకు పరీక్షలు చేసి, ఐరన్, కాల్షియం మాత్రలు ఇచ్చారు. పిల్లలకు టీకాలు వేశారు. టిబి వ్యాధి లక్షణాలు గురించి వివరించి, గళ్ల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి అరుణకుమారి, సూపర్వైజర్ రమేష్, విజయలక్ష్మి, మేల్ అసిస్టెంట్ శ్రీనివాస్ మూర్తి, సచివాలయం ఎంఎల్‌హెచ్‌పి/సిహెచ్‌ఓ, ఎఎన్ఎంఎస్, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**చక్రాయపేట :** మండలంలోని నాగలగట్టుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్త్ నారీ స్వసక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా జనసేన పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త హరీష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. డిప్యూటీ డిఎంహెచ్ఓ ఖాజామొద్దీన్ మాట్లాడుతూ సురభి పిహెచ్‌సి జిల్లాలోనే మొదటి స్థానంలో రోగులకు సేవలందిస్తోందన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివప్రసాద్ సేవలు చాల ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పరమేష్, రామచంద్ర, కళ్యాణ్, ప్రసాద్, శివ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు. వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పించారు. జనసేన పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ హరీష్‌ను సన్మానించారు.

**చాపాడు (మైదుకూరు) :** మైదుకూరు మండలం జివి సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఉప వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ కుటుంబంలో మహిళ ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుధా, శ్రీనాథ్‌రెడ్డి, ఖలందర్, సుమతి, గాయత్రి బృంద, ఇలియరాణి, ఆరోగ్య విస్తరణ అధికారి గురువయ్య, సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA**
**E.P.No. 93/2025**
**O.S.No. 143/2024**

Thummaluru Venkata Subba Reddy, S/o Rami Reddy, Hindu, aged about 67 years, Business, residing at Kanuparthi Village, Chennur Mandal, Kadapa District. **...Petitioner/D.Hr.**

**Vs**

Tamatam Bala Krishna Reddy, S/o Subba Reddy, Hindu, aged about 50 years, Business, resident of Kondapeta Village, Chennur Mandal, Kadapa District. **...Respondent/J.Dr.**

**NOTICE TO RESPONDENT/JDR**

పై దావాలోని పిటిషనర్ E.P. షెడ్యూల్ దాఖలా ఆస్తిని జప్తు చేయించి కోర్టులో సేల్ చేయుటకు పై కోర్టులో పై E.P. దాఖలు చేసి ఉన్నారు. సదరు E.P.లో మీ హాజరు నిమిత్తమై వాయిదా 14.10.2025న ఉన్నది. కావున మీరు 14.10.2025న ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

**//By Order of Court//**

**M.SAI NIRANJAN BABU**
**M.SAI VAMSI KRISHNA**
**Advocates for Petitioner/D.Hr.**

**IN THE COURT OF THE HON'BLE XI ADDL. DISTRICT JUDGE, CHITTOOR DISTRICT AT : PILER**
**I.A.No. 32/2024**
**O.S.No. 04 of 2023**

Between:
Shaik Khader Basha & others. **...Petitioners/Plaintiffs**

**And**

Dr. C. Sandeep Kumar & others. **...Respondents/Defendants**

**NOTICES TO RESPONDENT NO. 79**

79. V. Manimala, Wo. D. Karunakar Reddy, R/at D.No. 1/63-6, Boti Cheruvu, Kadapa Town & District.

Whereas the above named petitioner(s)/Plaintiff(s) have filed the petition in the above matter. If you have got any objection, you may appear before this Court at 10:30 AM on 14-10-2025 either in person or through an advocate and file your objection before the Hon'ble Court. If you fail to do so, the matter will be decided ex-parte.

**//By Order of Court//**

**CMR VELU**
**SK. MASTHAN ZULFEKAR**
**Advocates, Hyderabad.**
**Cell No: 7702637790.**
**B.RAVEENDRANATHA REDDY**
**Advocate, Piler.**